క్లుప్తంగా

చల్లబడిన వాతావరణం

మల్హర్: ఆకాశంలో మబ్బులు రావడంతో మండలంలో ఒక్కసారిగా శనివారం వాతావరణం చల్లబడింది. భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఉపశమనం లభించింది. ఉదయం నుంచే ఆకాశంలో మబ్బులు రావడంతో మండలంలో చల్లని వాతావరణం నెలకొంది. దీంతో వ్యవసాయ కూలీలు, ఉపాధికూలీలు, గ్రామస్తులు వేడిమి నుంచి ఉపశమనం పొందారు. కాగా, పంటలు కోత దశకు చేరుకోగా వాతావరణ శాఖ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే చేతికందిన పంట దిగుబడి రాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ ప్రారంభం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలోని మెట్‌పల్లి వద్ద సెయింట్ మదర్ మేరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ బిషప్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉడుముల బాల, ఎం.జయపాల్, ఆర్.థామస్, భవాని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారి వెంట హెచ్ఎం, కరస్పాండెంట్ కే.ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి కామిడి శ్రీనివాసరెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి లేతకరి రాజయ్య, గందెసిరి మధుసూదన్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలైన సంఘటన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలోని జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకొంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పోలీస్‌హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహించే పసునూరి శివకుమార్ కానిస్టేబుల్ రేగొండ నుంచి ద్విచక్ర వాహనంపై భూపాలపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో మోరంచపల్లి గ్రామం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తలకు, చేతికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సుధాకర్ పరిశీలించారు. ప్రస్తుతం కానిస్టేబుల్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



వాజేడు : గత సంవత్సరం పోగొట్టుకున్న ఫోన్లను స్థానిక పోలీసులు గుర్తించి శనివారం బాధితులకు తిరిగి అందజేశారు. ఎస్సై వెంకటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దగొల్లెం గూడెం గ్రామానికి చెందిన విద్యార్థి అస్వాన్ కుమార్, పేరూరు పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్ తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. వారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ మొబైల్ మిస్సింగ్ యాప్‌లో రిజిస్టర్ చేశారు. దీంతో ఫోన్లు ట్రేస్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వాటిని శనివారం పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు



వాజేడు: మండలంలోని అయ్యవారిపేట ఇసుక క్వారీ నుంచి అధిక లోడుతో వెళ్తున్న మూడు ఇసుక లారీలపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. అయ్యవారిపేట క్వారీ నుంచి ఉండాల్సిన లోడు కంటే ఇసుకను 3 నుంచి 3.5 టన్నులు అధికంగా లోడ్ చేసుకుని వస్తున్నట్లు తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా లారీలను తనిఖీ చేస్తుండగా మూడు లారీల్లో అధిక లోడు ఉన్నట్లు గుర్తించి లారీలతోపాటు డ్రైవర్లు ఉరుకొప్పుల దస్తగిరి, నిమ్మల సాయి, గడ్డం వినయ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లారీలను వాజేడు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ (కొత్తపల్లిగోరి): పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కొత్త, పాత భేదం లేకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు శనివారం భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గాజర్ల పురుషోత్తం, కోడూరి శ్రీనివాస్, కాశెట్టి వరదరాజు, రామదాసు, కుమారస్వామి, వెంకటేష్ ఉన్నారు.

సుధాకర్ తల్లికి అండగా ఉంటాం

చిట్యాల: పేద ప్రజల కోసం అజ్ఞాతంలోకి వెళ్లి ప్రాణాలు అర్పించిన మావోయిస్టు సిరిపెల్లి సుధాకర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చల్లగరిగె గ్రామానికి చెందిన మావోయిస్టు సుధాకర్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శనివారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మావోయిస్టు సుధాకర్ తల్లి రాజపోశమ్మకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్, కటంగూరి రాంనర్సింహారెడ్డి, మండల నాయకులు కామిడి రత్నాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గడ్డం కొంరయ్య, రవి, ఆకుల సుధాకర్, తడుక కుమార్ ఉన్నారు.



సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

పాండవుల గుట్టను అభివృద్ధి చేస్తా..



మాట్లాడుతున్న అరూరి రమేష్

రేగొండ: తనను ఎంపీగా గెలిపిస్తే పాండవుల గుట్టను టూరిజం కింద అభివృద్ధి చేస్తానని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. శనివారం మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని గూడెపలి, భాగిర్థిపేట, దుంపిల్లపల్లి గ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేసి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రపంచ నాయకుడిగా కీర్తి ప్రతిష్టలు అందుకుంటున్న వ్యక్తి మన ప్రధానిగా ఉండటం దేశ ప్రజలకు శ్రీరామ రక్ష అన్నారు. నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని అవుతారని తెలిపారు. వరంగల్ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. భూపాలపల్లికి రైల్వే లైన్ తీసుకువస్తానన్నారు. రేగొండ మండల కేంద్రంలో బస్టాండ్, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందని కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, పార్లమెంట్ ప్రబారీ మురళీగౌడ్, రాష్ట్ర నాయకులు ధర్మరావు, పాపయ్య, సత్యపాల్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ ప్రసాద్‌రావు, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, బీజేవైఎం నాయకులు మల్లేష్, రాకేష్, రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘పంటకోత’తో దిగుబడి అంచనా



పంట దిగుబడిని అంచనా వేస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడిని అంచనా వేయవచ్చని ముఖ్య ప్రణాళిక అధికారి సామ్యూల్ అన్నారు. శనివారం మండలంలోని కొర్కిశాల గ్రామానికి చెందిన నర్ర కవిత వరిపంటలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. పంట పొలంలో ఎంపిక చేసిన భూభాగంలో పంటను ఐదు మీటర్ల పొడవు ఐదు మీటర్ల వెడల్పుతో పంట కోత ప్రయోగం నిర్వహించగా 22కిలోల 620 గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. అనంతరం గ్రామంలో ధరల వివరాలు, తేమశాతం తెలుసుకున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌ను పరిశీలించారు. ఉప గణాంక అధికారి అలివేలు, మండల ప్రణాళిక గణాంక అధికారి శిరీష, రైతులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కాళేశ్వరం: ఉపాధి హామీ పథకంలో కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. కాళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫిష్ బ్రీడింగ్ పాండ్ పనులను మహదేవపూర్ ఎంపీడీఓ కే.వెంకటేశ్వర్లు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.300 వేతనం పొందచ్చని సూచించారు. పని ప్రదేశంలో షేడ్‌నెట్, నీటి వసతి గ్రామ పంచాయతీ ద్వారా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎండ తీవ్రతకు ఎవరైనా వడదెబ్బకు గురైతే ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంటాయని సూచించారు. 150కి పైగా ఎక్కువ మొత్తంలో కూలీలు పాల్గొనడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మెట్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న మినీ పర్కోలేషన్ ట్యాంక్ పని ప్రదేశాన్ని పరిశీలించారు. ఏపీఓ రమేష్, కాళేశ్వరం కార్యదర్శి సత్యనారాయణ, సతీష్ ఉన్నారు.

నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు



పోలీస్ స్టేషన్‌లో ఉంచిన నంబర్‌ప్లేట్ లేని వాహనం

కాటారం: వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని లేకుంటే చట్ట పరంగా చర్యలు తప్పవని ఎస్సై మ్యాక అభినవ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై తిరుగుతున్న పలు ద్విచక్ర వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మొదటి హెచ్చరికలో భాగంగా నంబర్ ప్లేటు బిగించుకున్నాక వాహనాలను తిరిగి ఇచ్చేశారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా తమ వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు, నంబర్ ప్లేటు కలిగి ఉండాలని సూచించారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సమావేశానికి తరలిరావాలి

కాటారం: పెద్దపల్లిలో ఈ నెల 22న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి సమావేశానికి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాదిగ జాతిని కాంగ్రెస్ మోసం చేసిందని, మూడు ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించలేదని పేర్కొన్నారు. మాదిగ జాతిని సన్నద్ధం చేయడంలో భాగంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని పెద్దపల్లి సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. మాదిగ సైన్యం పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న శామ్యుల్

రేగొండ: అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైనా పాఠశాలల్లో పనులను నాణ్యాతా ప్రమాణాలు పాటిస్తు త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి శామ్యుల్ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శామ్యుల్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైనా 26 పాఠశాలల్లో పనులను సోమవారం నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ పనులను నాణ్యతతో జూన్ 10 లోపు పూర్తి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి



ఊయ్యాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ దేవానాయక్

భూపాలపల్లి అర్బన్: తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఎంఈఓ దేవానాయక్ అన్నారు. జాయ్‌ఫుల్ లర్నింగ్ కార్యక్రమంలో భాగంగా జంగేడు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను శనివారం ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ఆహ్లాదకరంగా ఉన్నప్పుడే విద్యార్థులు ఆకర్షితులై అభ్యసనం కొనసాగిస్తారని ప్రీ-ప్రైమరి అనేది విద్యార్థులకు పునాది అన్నారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమం ప్రారంభించి ఆట వస్తువులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రీ-ప్రైమరి తరగతుల విద్యార్థులు ఆడుతూ పాడుతూ చదువు నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అశోక్, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘కారు’ దిగనున్న ముఖ్య నేతలు?

రేగొండ: ఉమ్మడి రేగొండ మండలం నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. శనివారం జిల్లా కేంద్రంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండలంలోని ఇద్దరు ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షుడితో పాటు పలువురు మాజీ సర్పంచులు గైర్హాజరైనట్లు సమాచారం. దీంతో వారు కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌లోకి సంగి రవి?

టేకుమట్ల: ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కాగా మండల పార్టీ అధ్యక్షుడు కోటగిరి సతీష్‌తో మంతనాలు జరపడంతో ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే వాదన బలంగా వినిపిస్తుంది.

మండల కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న తిరుపతి

చిట్యాల: యూత్ కాంగ్రెస్ మండల కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్ పాటి తెలిపారు. మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అల్లకొండ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా గోపగాని శివకృష్ణ, నాగరాజు, లటికే రాజు, అల్లే నాగరాజు, ఉపాధ్యక్షులుగా కంచర్ల రాంబాబు, గుంటుక కిషోర్ పటేల్, బొజ్జం వేణు, తీగల నాగరాజు, సహాయ కార్యదర్శులుగా కాంపెల్లి శ్రీకాంత్, మేకల శ్రీకాంత్, ముఖ్య సలహాదారులుగా రాకేష్, ప్రచార కార్యదర్శిగా నంబుల రంజిత్, సెక్రటరీలుగా మురహరి భానుచందర్, మొలుగూరి రమేష్, అరేపల్లి రమణకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శ్రీకాంత్ తెలిపారు. అనంతరం ఎన్నికైనా సభ్యులను మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్యలు అభినందించి నియామక పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు రాజ్‌మహ్మద్, మండల నాయకులు బుర్ర శ్రీనివాస్, బుర్ర లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రయాణం చేసేదెలా..?



పోలారం వద్ద ధ్వంసమైన రోడ్డు



ఉట్లపల్లి వద్ద కంకర తేలిన రోడ్డు

- కిలోమీటర్ల కొద్ది ధ్వంసమైన రహదారులు
- పట్టించుకోని అధికారులు

మహాముత్తారం: మండలంలోని రహదారులు ధ్వంసం కావడంతో కంకరలేచి ప్రమాదకరంగా మారాయి. మండలంలోని యత్నారం నుంచి సింగంపల్లి, పోలారం నుంచి ఉట్లపల్లికి పోయే ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కిలోమీటర్ల పొడవున కంకర లేచి భారీగా గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు చెడిపోయి సంవత్సరాలు గడిచినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో రాత్రి సమయంలో వాహనదారులు ఈ రహదారి గుండా ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయితీరాజ్ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా గత సంవత్సరం క్రితం రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపగా నిదులు మంజూరయ్యాయి. కానీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు నిర్మాణం జరుగలేదని తెలిపారు.

కనులపండువగా శోభాయాత్ర

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఐదు రోజుల పాటు కనుల పండువగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని పురవీధుల్లో దేవతామూర్తులను ప్రత్యేక రథంలో తయారు చేసి డీజే పాటలతో ఊరేగింపుగా శోభాయాత్ర కొనసాగించారు. మహిళలు కోలాటం వేస్తూ ఊరేగింపు యాత్రను వైభవంగా నిర్వహించారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



వాజేడు: బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు



గోవిందరావుపేట: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

వాజేడు: మండలంలో పోలీసులు శనివారం విస్తృతంగా వాహన తనిఖీలు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు అందులోని బ్యాగులను, లగేజీని సోదా చేశారు. మావో యిస్టుల కదలికలపై ఆరా తీశారు.

గోవిందరావుపేట : ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో పస్రా ఎస్సై కమలాకర్ తన సిబ్బందితో కలిసి శనివారం పస్రా సరిహద్దు ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి సోదాలు చేసి వాహనదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం సరఫరాను అడ్డుకోవటానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు.

గుడుంబా కేంద్రాలపై ఎక్సైజ్ దాడులు



నానబెట్టిన బెల్లంపానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది

గోవిందరావుపేట: గుడుంబా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తం విస్తృతంగా దాడులు నిర్వహించారు. శనివారం ములుగు ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో ములుగు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, స్టేట్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ సంయుక్తంగా కలిసి దాడులు చేపట్టారు. మండలంలోని పాపయ్యపల్లి, బాలాజీనగర్, సంద్రగూడెం, మాన్యతండ, రాంనగర్ గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దాడుల్లో 40 లీటర్ల నాటు సారా, 100 కిలోల బెల్లంను స్వాధీనం చేసుకొని, 2000 లీటర్ల బెల్లం/చక్కెర పానకం ను ధ్వంసం చేసి నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, రవాణా చేసిన, నాటుసారా తయారీ ముడిపదార్థాలను అమ్మినా చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ములుగు ఎక్సైజ్ ఎస్సై లింగయ్య గౌడ్, ఎస్‌టీఎఫ్ ఎస్సై శివ, స్టేషన్ సిబ్బంది, ఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

వెంకటాపురం(కె): పాలెం ప్రాజెక్టు కాల్వను నమ్ముకొని వరిపంటసాగు చేసి పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసి నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆది వాసి నవనిర్మాణ సేన బృందం పాలెం ప్రాజెక్టు కింద ఎండిపోయిన పంట పొలాలను వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలెం ప్రాజెక్టులను నమ్ముకొని రైతులు వందల ఎకరాల పంటలు సాగుచేశారని అన్నారు. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రాజెక్టులో నీరు వృథాగా పోయిందని వాపోయారు. ప్రాజెక్టు కాల్వ నీరు అందకపోవడంతో చేతికి అందివచ్చిన పంటపొలాలు ఎండిపోయాయన్నారు.ఎండిన పంట పొలాలను సర్వే చేసి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట ఇర్ప బాబు, అట్టం శివ, చేలె బాలకృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.